# ఆటకట్టు

విశాఖ




ఇంటర్వ్యూకి వచ్చిన వారంతా వరండాలో కూర్చుని ఉన్నారు. ఆఫీసు ప్యూను వచ్చి ఒక్కొక్కరి పేరే పిల్చి లోపలికి తీసుకెళ్తున్నాడు. వెళ్ళేవాళ్ళనే గాని, అసలు ఇంటర్వ్యూ అయ్యాక బయటికి వచ్చేవాళ్ళని వరండాలో ఉన్న మిగతా కాండిడేట్సు చూడడం జరగడంలేదు. ఆ ఇంటర్వ్యూ జరిగే హాలుకి అటు

వైపున మరో తలుపు, వెలుపలికి వెళ్ళే దారి ఉండి ఉండాలి.

అందరూ అయిపోవచ్చారు. ఒక్క అమ్మాయి మాత్రం ఉంది. ప్యూన్ వచ్చి "సుజలక్ష్మి మిస్ సుజలక్ష్మి" అని పిల్చాడు. లేచి నిల్చుని, కుచ్చెళ్ళని సర్దుకుని, చేతిలోని ఫైలు కేసి చూసి, ఇంటర్వ్యూ జరిగే గదిలోకి అడుగు పెట్టింది ఆ అమ్మాయి.

లోపల పెద్ద టేబిలు, లామినేటెడ్ టాప్‌ది ఉంది. టేబిలుకి ఆ ప్రక్కన ఒక వయస్సు మళ్ళినాయినా, ఒక ముప్ఫయియేళ్ళ యువకుడూ కూర్చుని ఉన్నారు.

"గుడ్‌మార్నింగ్ మిస్...." అంటూ ఆపేశాడు ఆ యువకుడు.

"గుడ్‌మార్నింగ్ సర్....స్...." అందా అమ్మాయి తొట్రుపడుతూ.

"మిస్. ప్లీజ్ సిట్‌డవున్. నేను శరత్‌బాబుని. ఈ బ్రాంచికి మేనేజర్ని. వీరు రామనాధంగారు. ఈ కంపెనీకి స్వంతదార్లన్నమాట. ఈ జాబ్ ఆంధ్రా విలేజెస్‌లో కనుక తెలుగువారికి గానీ, తెలుగు బాగా చదవటం వ్రాయటం మాట్లాడటం తెలిసినవారికే గానీ ఇవ్వాలని మా మానేజిమెంటు అభిప్రాయం. అందుకే ఇంటర్వ్యూకూడా తెలుగులోనే చెయ్యమని సూచించారు. మిస్ సుజలక్ష్మి! మీకు తెలుగువచ్చా?" అని ఇంగ్లీషులో అడిగాడు.

"నేను కాలేజీలో తెలుగు తీసుకున్నానండీ."

"మీరు మద్రాసులో ఉంటున్నారా?"

"అవునండీ! కానీ మొదట చదవటం మాత్రం బెజవాడలోనేనండి."

"అహా! మీ పేరు అలా ఎలా వచ్చింది? సుజలక్ష్మి అన్నది చాలా అరుదుగా వింటాము. అదీ ఈ ఢిల్లీలో నేను ఉండిపోవటంవల్లలా వుంది. తెలుగువారికి చాలా దూరం అయినందువల్ల కొన్నికొన్ని మాకు క్రొత్తగా ఉంటాయి. కదండీ రామనాధంగారూ!" అన్నాడు శరత్‌బాబు చేతిలో నున్న పెన్సిలుని గుండ్రంగా తిప్పుతూ.

"మరేం లేదండి, మాకు ఇద్దరు మేనత్తలు. సుజాత, మహాలక్ష్మి అనేవి వాళ్ళ పేర్లు. ఇద్దరికీ చిన్నప్పటినుంచి అన్నింట్లో పోటీలు. మా నాన్నగారు ఇద్దరిలో ఒకరిపేరు పెడితే రెండోవారు చిన్నపుచ్చుకుంటారని ఇద్దరివీ కలిపి పెట్టారు," అంది. శరత్‌బాబు ముఖం అదోలా మారింది. అప్పుడు రామనాధంగారు తలెత్తి "ఒరిజినల్ సర్టిఫికేట్లు తెచ్చావా అమ్మాయి" అని అడిగారు.

"ఇవిగోనండి. ఇందండి ఇవి స్కూలువి, ఇది బియ్యెస్సీ డిగ్రీ. ఇది ఎమ్మెస్సీ. ఎమ్మెస్సీ మెద్రాసులో చదివానండి. ఇవి పాటలపోటీల్లో వచ్చిన సర్టిఫికేట్సు," అంటూ అన్నీ యిచ్చింది.

వాటిని చూడాలని తొందరపడు తున్నట్లు కన్పించాడు శరత్ బాబు.

రామనాధంగారు చూశాక వాటిని శరత్ బాబుకే ఇచ్చారు. వాటిని చూస్తున్న శరత్ బాబుకి ముఖమంతా చిరుచెమట్లు పోసాయి. జేబు రుమాలుతో ముఖం తుడుచుకుని, బల్లమీదున్న గ్లాసుడు నీళ్ళు త్రాగేసాడు. వాటికేసే తదేకంగా పరీక్షగా చూసాడు.

ఆ అమ్మాయి ఇబ్బందిగా కుర్చీలో కదిలింది. "అవి ఒరిజినల్సేనండి. కాపీలు అప్లికేషనుతోటే పంపాను." అంది.

"మీరు ఇంతదూరం ఉద్యోగంకోసమే వచ్చారా లేక...." అంటూ ఆపాడు శరత్ బాబు.

"ఉద్యోగం కోసమేనండి వస్త. మా అంకుల్ లజపతినగర్‌లో వున్నారు. వారింట్లో ఉంటూ ట్రై చేస్తున్నాను" అంది.

"ఎమ్మెస్సీ ఫస్టుక్లాసులో ప్యాసయిన మీరు ఏ నేషనలైజ్డ్ బ్యాంకుకో మద్రాసులోనే అప్లయిచేసి ఉండొచ్చుగదా!" అని శరత్ బాబు అంటూంటే ఆ అమ్మాయి తొట్రుపడుతూ సమాధానం యిచ్చింది.

"ప్రయివేటు కంపెనీ అయితే మనిషి సామర్ధ్యతకు ప్రాముఖ్యం వుంటుందని."

"ఆహా అలాగా" అన్నారు రామనాధంగారు.

"మీ సర్టిఫికేట్లూ అవీ ఇక్కడ వదిలెయ్యడానికి మీకేమైనా అభ్యంతరముందా? మళ్ళీ ఎల్లుండివచ్చి తీసుకెళ్ళరుగాని దాంతోబాటే అప్పాయిమెంటు ఆర్డరు కూడా. లేదూ మీకు అభ్యంతరముంటే ఎల్లుండి వచ్చినప్పుడే ఒరిజినల్స్ ఇచ్చి అపాయిమెంటు ఆర్డరు తీసుకోవచ్చు. యూ ఆర్ సెలక్టెడ్" అన్నాడు శరత్ బాబు.

రామనాధంగారూ ఆ అమ్మాయీ కూడా ఆశ్చర్యంగా చూసారు.

తనని సంప్రదించకుండానే ఎవరికో అపాయిమెంటు ఇచ్చానంటున్నాడేమిటి అన్న ఆశ్చర్యం రామనాధంగారికి— సబ్జక్టులో ప్రశ్నలు వేసి తికమక పెట్టుతారేమోనని భయపడుతున్న తనని ఏ ప్రశ్నలూ వెయ్యక ఇంటర్వ్యూ అప్పుడే సెలక్టెడ్ అన్నారేమిటా అన్న ఆశ్చర్యం ఆ అమ్మాయికి.

ఇద్దరికేసి చూసి, శరత్ బాబు "మీరు అలా ఆశ్చర్యపోకండి. ఎల్లుండి రండి. మీకే తెలుస్తుంది, నా మాటల్లోని నిజాలన్నీను. మిస్ మీరు ఆ సర్టిఫికేట్లు వదులుతారా? మా మానేజిమెంటు కమిటీకి చూపాలి. అవి మళ్ళీ యిచ్చేసేవే. లేదూ ఎల్లుండి తెచ్చినా సరే" అంటూ ఆ అమ్మాయితో అన్నాడు.

"మరేం ఫర్వాలేదు సార్. మీరు ఉద్యోగం ఖాయం అంటున్నారాయె. ఎల్లుండిస్తామన్నారాయెను. చాలా థాంక్సు సార్" అంటూ లేచి నిలబడి సర్టి

ఫికేట్లని బల్లమీద పెట్టింది. ఆ పెట్టు తున్నపుడా అమ్మాయి ముఖంలో సందేహాలు కనబడ్డాయి. ఆ కాగితాలువదలకం ఇష్టంలేనట్లన్పించింది.

బెల్లుకొట్టి, వచ్చి నిల్చున్న క్లార్కుతో "ఈవిడికి అదే మిస్ సుజలక్ష్మిగార్కి అని ఎడ్రసు చేసి మీ సర్టిఫికేట్లు మా దగ్గరున్నాయి అని వ్రాసి సంతకం చేసి వారికి రెసీట్ ఇవ్వండి. మిస్! ఎల్లుండి వచ్చినప్పుడు ఈ రిసీట్ తెండి. ఓకే. ఇంకమీరు మా హెడ్ క్లార్కుతో, ఆ తలుపులోంచి ఇటు ఈ వేపునించి ఆఫీసుద్వారా బయటికి వెళ్ళండి. ఎల్లుండి మార్నింగ్ టెన్‌కి రండి" అంటూ శరత్ బాబు ఇంటర్వ్యూని ముగించేసాడు.

రామనాధంగారు వాళ్ళని వెళ్ళనిచ్చి "శరత్‌బాబూ! ఏవిటిది? నన్ను కన్సల్ట్ చేయకుండానే ఆ అమ్మాయిని అపాయింటు చేసేసావు, నాకేం అర్థంకావడం లేదు. మొదట వచ్చిన రాఘవరెడ్డి నాకు చాలా ఎఫీషియంట్‌గా కన్పడ్డాడు ఈ అమ్మాయికి ఇంగ్లీషు మాట్లాడటంకూడా రానట్లుంది," అన్నారు.

"సార్! ఈ పిల్ల తెచ్చిన సర్టిఫికేట్లు ఈ పిల్లవా కావా అని నా కనుమానం అది వెరిఫై చేయాలి. అందుకే నేను రెండ్రోజులయ్యాక రమ్మన్నాసార్.

ఈ పిల్లదే అయితే నా పొరబాటు వల్ల ఈ అమ్మాయినే మీరు అపాయింటు చెయ్యాల్సి 'వస్తుంది. అప్పుడు టెంపరరీగా వేసుకుని ఆ పీరియడ్ అః గానే తీసేద్దాం. ప్లీజ్ హావ్ కాన్ఫిడెన్సు. నేను పొరబాట్లు చెయ్యనుసార్ మీ నెవ్యూ. పోలీసుడిపార్టుమెంటు సుధ కర్ని, ఎల్లుండి మధ్యాహ్నం రమ్మనండి. నాది తప్పు కాకపోతే ఆ అమ్మాయిని స్టేషనుకి తీసుకెళ్ళాల్సి ఉంటుందని చెప్పండి' అని ఆవేశంగా అన్నాడు శరత్‌బాబు.

రెండోరోజు ఉదయం ఠంచనుగా కాన్ఫిడెన్సుతో ఉద్యోగం వచ్చేసినట్లే అన్న ధీమాతో వరండాలో కూర్చుంది ఆ అమ్మాయి. క్రితంసారి వచ్చినప్పుడు ఇంటర్వ్యూ గురించిన అదుర్దా ఈసారి లేనందున ధైర్యంగా చారగిలబడి కూర్చుంది. ప్యూను వచ్చి లోపల పిలుస్తున్నారని చెప్పగానే సంతోషంగా స్వింగుడోరుని త్రోసి లోపలికి అడుగు బెట్టింది. ఇద్దిరికి బదులు ముగ్గురుండే సరికి కాస్త ఒక్కడుగు వెనక్కి వేసింది.

"కమిన్. గుడ్‌మార్నింగ్" అన్నారు రామనాధంగారు.

ఎవరూ పలకలేదు. అంతా నిశ్శబ్దంగా ఉంది.

లోపలకు వచ్చి కూర్చున్న అయిదు నిముషాలకి మెల్లగా నిశ్శబ్దంగా వున్న ఆ గదిలో వాళ్ళు యిచ్చిన రెసీట్‌ని బల్లమీదుంచి మీ రివాళ రమ్మన్నారు. నా సర్టిఫికేట్లు యిచ్చేసి అప్పాయిమెంటు యిస్తానన్నారు" అంటూ మెల్లగా చెప్పింది.

ఆ క్రొత్తవ్యక్తి అదె సుధాకర్ కాస్త గట్టిగా "మిస్, ఆ సర్టిఫికేట్లు మీవేనా?" అని గదమాయించాడు.

"నావేను. నేనే సుజలక్ష్మిని" అంది.

"మేం కాదంటున్నాం. మెద్రాసులో ఉన్న సుజలక్ష్మి యింటికెళ్ళి తన స్నేహితురాలు శారద కజిన్ని అని చెప్పుకుని బ్యాంకు ఉద్యోగానికి ఎలా అప్లయి చేయాలి, నీవి అప్లికేషను వ్రాసిన వాటి కాపీలు చూపించమని చెప్పి, సుజలక్ష్మి ఇచ్చిన ఫైలు తిరగేస్తూ మంచి నీళ్ళు కావాలని అడిగి, సుజలక్ష్మి వెళ్ళి నీళ్ళు తెచ్చేలోగా, సర్టిఫికేట్లు మాత్రం సంగ్రహించి ఫైలుని పెట్టేసి నీళ్ళు త్రాగి ఏమీ ఎరగనిదానిలాగా వెళ్ళి పోయావంటున్నాను" అన్నాడు సుధాకర్.

ఆ అమ్మాయి నిర్ఘాంతపోయింది. చేతిలో ఉన్న బ్యాగు స్ట్రాపుని వేలుమీద చుట్టుకుంటూ చేష్టలుడిగి కూర్చుండి పోయింది. మెల్లగా తమాయించుకుని దబాయించడం ప్రారంభించింది.

"సార్! మీరు అనేవన్నీ అబద్ధాలు సార్. నేనే సుజలక్ష్మిని. ఆ సర్టిఫికేట్లు నావేను కావనగలరా?"

శరత్‌బాబుకి చిరాకేసింది. విసుగుతో "సుధాకర్ నువ్వేవరవో చెప్పెయ్యి" అన్నాడు.

"మిస్. మీ అసలు పేరేమిటి? మిమ్మల్ని అరెస్టు చెస్తున్నాను" అన్నాడు సుధాకర్.

"మీరు.... మీరు ... పోలీసువారా?"

"ఆ... సుజలక్ష్మి తన సర్టిఫికేట్లు పోయాయని ఇచ్చిన రిపోర్టుని మద్రాసు బ్రాంచిలో చూసాం. మీరింక దబాయించకండి. నడవండి స్టేషనుకి" అని అధికారంగా అన్నాడు సుధాకర్.

పులి మేక ఆటలో పులి ఆటకట్టయినట్లుగా తన పనయిందేవిటి? తను సర్టిఫికేట్లు సుజలక్ష్మినించి దొంగిలించిందన్న విషయం ఇంతదూరంలో వున్న ఈ ఢిల్లీలో వీళ్ళకి ఎలా తెలిసిందా అని ఆలోచించిందా అమ్మాయి. అందుకేగా తను బెజవాడలోగానీ మద్రాసులోగానీ ట్రై చేయక ఢిల్లీకి వచ్చింది. అయినా వీరు ఎలా కనుక్కున్నారా అనుకుంటూ ఇనస్పెక్టరు సుధాకర్‌వెంట గత్యంతరం లేక నడిచింది.

ఖర్మ అలావుంటే పదివేల మైళ్ళు దాటినా విధి వెంటాడుతుందని తెలీదులా వుంది.

ఏ సుజలక్ష్మి దగ్గరైతే ఆ సర్టిఫికేట్లు దొంగిలించిందో ఆ సుజలక్ష్మి ఇంక ఉద్యోగాలకి అప్లయిచేయక పెళ్ళి చేసుకుందనీ, ఆ సుజలక్ష్మి భర్తే శరత్‌బాబనీ, ఆ సర్టిఫికేట్లు భార్యకి చూపించి వెరిఫై చేసుకోవడానికే శరత్‌బాబు రెండ్రోజులయ్యాక రమ్మన్నాడనీ ఆ అమ్మాయికి తెలియదు.

---